ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం


2


2

ఫిక్స్‌డ్ డిపాజిట్ల పేరుతో భారీ మోసం

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in



ఆర్టీసీ డిపోలో బతుకమ్మ సంబరాలు

ఆర్మూర్ ఆర్టీసీ డిపోలో బుధవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. డిపోలో మహిళా కండక్టర్లు బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పి.రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్ సావిత్రి, మెకానికల్ ఫోర్‌మన్ గంగాకిషన్ డిపో ఉద్యోగులు పాల్గొన్నారు. - అక్షరటుడే, ఆర్మూర్

24-9-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2





## కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యం

**అక్షరటుడే, ఇందల్వాయి:** కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఒకటో డివిజన్ పరిధిలోని ఖానాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. మహిళల కోసం ఇందిరమ్మ ఇళ్లు, ఉచితం బస్సు ప్రయాణం కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో ఏఎంసీ ఛైర్మన్ ముప్పా గంగారెడ్డి, ఫిషరీస్ ఛైర్మన్ శ్రీనివాస్, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంగోపాల్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, ఖానాపూర్ డివిజన్ అధ్యక్షుడు రాజేందర్, మాజీ కార్పొరేటర్ కోర్వ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన బాలికల విద్యాభ్యాసానికి పెద్దపీట

**అక్షరటుడే, బాన్సువాడ:** గిరిజన బాలికల విద్యాభ్యాసానికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నస్రుల్లాబాద్ మండలం దుర్కి శివారులో నూతనంగా నిర్మించిన గిరిజన బాలికల ఇంటర్, డిగ్రీ వసతి గృహాన్ని ఆయన బుధవారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి చదువు కోసం బాన్సువాడకు వచ్చే గిరిజన బాలికలకు వసతి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ వసతి గృహ నిర్మాణంతో సమస్యలు తీరనున్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అధికారి సతీష్, బీర్కూర్ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు దుర్గం శ్యామల, మాజీ ఎంపీపీ విఠల్, బద్యానాయక్, మోహన్ నాయక్, బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## జుక్కల్ నియోజవర్గానికి ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలి

**అక్షరటుడే, బాన్సువాడ :** జుక్కల్ నియోజవర్గానికి ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతమని వివరించారు. అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. జుక్కల్ నియోజకవర్గానికి స్వయంగా వచ్చి పరిస్థితులను పరిశీలించాలని ఆహ్వానించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సానుకూలంగా స్పందించి, త్వరలోనే నియోజకవర్గాన్ని సందర్శిస్తానన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.




## భాష రాకున్నా భావాలతో సంభాషణ భళా

**అక్షరటుడే, ఇందూరు:** భాష రాకున్నా భావాలతో సంభాషించడం అద్భుతమని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవం సందర్భంగా డెఫ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నిజామాబాద్ అధ్వర్యంలో నగరంలోని టీఎన్జీవో కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తుల మధ్య సంభాషణకు భాష అవసరమన్నారు. అలాంటి భాషను వినలేని, మాట్లాడలేని బధిరులకు సమాచారాన్ని అర్థమయ్యే రీతిలో అందించేందుకు ఆవిర్భవించిందే సంకేత భాష విధానమని అన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సౌందర్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ల లక్ష్మీనారాయణ, భూపతి, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలలో తాగునీటి కొరత తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ స్కీం పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం కింద ప్రతి మున్సిపాలిటీకి కోట్లాది రూపాయల నిధులను కేటాయించింది. ఈ నిధులతో ఇంటర్నల్ పైప్‌లైన్, ట్యాంకులు నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు ఈ స్కీం కింద రూ.180 కోట్ల నిధులు కేటాయించగా పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి.

– అక్షరటుడే, కామారెడ్డి



# నీళ్లెప్పుడు వచ్చేనో?

▸ నత్తనడకన అమృత్ స్కీం పనులు ▸ ఇప్పటికీ మొదలు కానీ ట్యాంక్‌ల నిర్మాణం ▸ ఐదు నెలలుగా కొనసాగుతున్న పైప్‌లైన్ పనులు

జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మూడు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇటీవల బిచ్కుందను మున్సిపాలిటీగా ప్రభుత్వం ప్రకటించింది. అయితే తాగునీటి అవసరాలను తీర్చేందుకు కావాల్సిన నిధులను ఆయా మున్సిపాలిటీల ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం అమృత్ స్కీం కింద నిధులను కేటాయించింది. కామారెడ్డికి రూ.93 కోట్లు, ఎల్లారెడ్డికి రూ.35 కోట్లు, బాన్సువాడకు రూ.52 కోట్లు మంజూరు చేసింది. ప్రభుత్వం టెండర్ నిర్వహించగా మెగా ఇంజినీరింగ్ కంపెనీ టెండర్ దక్కించుకుంది. టెండర్ ప్రక్రియ పూర్తయి ఏడాది పూర్తవుతున్నా.. ఇప్పటికీ ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. పైప్‌లైన్ పనులు అస్తవ్యస్తంగా మారాయి. ఇప్పటికీ ఒక్క ఏరియాలో కూడా పూర్తిస్థాయిలో పైప్‌లైన్ పనులు పూర్తి కాలేదు.

### ట్యాంకులు నిర్మించేదెప్పుడో?

మున్సిపాలిటీలోని వార్డులలో ఇంటర్నల్ పైప్‌లైన్లు వేయడంతో పాటు నీటి నిల్వ కోసం ట్యాంకులు కూడా నిర్మించాల్సి ఉంది. కామారెడ్డి మున్సిపాలిటీలో 9 ట్యాంకులు నిర్మించాల్సి ఉండగా కేవలం జయశంకర్ కాలనీ, గ్రీన్ సిటీ, ఎండీఆర్ ఫిల్టర్ బెడ్ వద్ద మాత్రమే ట్యాంకుల నిర్మాణం ప్రారంభించారు. ప్రగతి నగర్, సీనియర్ సిటిజన్ అసోసియేషన్, ఇస్లాంపురా, డ్రైవర్స్ కాలనీ, మున్సిపల్ వాటర్ వర్క్స్ విభాగం, లిటిల్ స్కాలర్స్ స్కూల్ సమీపంలో ట్యాంకులు నిర్మాణం చేయాల్సి ఉంది. ఎల్లారెడ్డి పట్టణంలో 4, బాన్సువాడలో 6 ట్యాంకులు నిర్మించాల్సి ఉంది.

### మల్లన్నగుట్ట నుంచి నీళ్లు..

కామారెడ్డి పట్టణానికి సదాశివనగర్ మండలం మల్లన్న గుట్ట నుంచి 10 ఎంఎల్‌డీల తాగునీటిని రూరల్ డెవలప్‌మెంట్ శాఖ అధికారులు తీసుకురానున్నారు. మల్లన్న గుట్ట నుంచి ఎండీఆర్ ఫిల్టర్ బెడ్ వరకు నీటిని తెచ్చి అక్కడ నీటి శుద్ధి చేసి పైప్‌లైన్ల ద్వారా ట్యాంకులు నింపనున్నారు. మరోవైపు కామారెడ్డి పెద్ద చెరువు నుంచి సైతం నీటిని తీసుకురానున్నారు. రెండు వైపుల నుంచి నీటి సరఫరా చేయడంతో పట్టణ ప్రజల దాహార్తి తీరనుంది.

### కొరవడిన పర్యవేక్షణ

కామారెడ్డి పట్టణంలో 104 కిలోమీటర్ల మేర పంపింగ్, ఫీడర్ పైప్ లైన్లు వేయాల్సి ఉండగా డ్రైవర్స్ కాలనీ, బీడీ వర్కర్స్ కాలనీలలో పైప్ లైన్ పనులు కొనసాగుతున్నాయి. ఎల్లారెడ్డి పట్టణంలో 46 కిలోమీటర్లు, బాన్సువాడ పట్టణంలో 61 కిలోమీటర్లు పైప్ లైన్ పనులు ప్రారంభమైనా మందకొడిగా సాగుతున్నాయి. అమృత్ పథకం కింద నిధులు గత ప్రభుత్వ హయాంలోనే మంజూరయ్యాయి. కానీ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. దీనికి కారణం పనులపై పర్యవేక్షణ కొరవడడమేనని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ పనులను పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్లు ఎప్పటికప్పుడు పనులపై సమీక్ష చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### జూన్ వరకు పూర్తి చేస్తాం

అమృత్ స్కీం పనులు కొనసాగుతున్నాయి. మూడు మున్సిపాలిటీలలో వచ్చే సంవత్సరం జూన్ వరకు తాగునీరు అందించేలా ప్రణాళిక చేస్తున్నాం. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. వర్షాలు, పండుగల కారణంగా పనులలో జాప్యం నెలకొంది. కొద్దిరోజుల్లో రాత్రి పగలు పనులు కొనసాగనున్నాయి.


– సంతోష్, పబ్లిక్ హెల్త్ డీఈ

## నిజాంసాగర్‌కు కొనసాగుతున్న వరద..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నిజాంసాగర్‌లో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. అలాగే ఎగువన సింగూరు, పోచారం ప్రాజెక్టుల నుంచి వరద వస్తుండడంతో నిజాంసాగర్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో అధికారులు 13 గేట్ల ద్వారా 60 వేల క్యూసెక్కుల నీటిని మంజీరలోకి వదులుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. జలాశయంలోకి ఎగువ నుంచి 69,859 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 1,405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 13.123 అడుగుల (1,402.34 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. గేట్లు ఎత్తి 1,00,351 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఆయకట్టు కోసం ప్రధాన కాలువకు వెయ్యి క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తినందున మంజీరా పరివాహక ప్రాంతాల ప్రజలు, పశువుల కాపరులు, రైతులు కాల్వల వైపు.. లో లెవల్ వంతెనల వైపు వెళ్లవద్దని పోతంగల్ తహశీల్దార్ గంగాధర్ సూచించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**అక్షరటుడే,ఇందూరు:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను హెచ్చరించారు. జక్రాన్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ బుధవారం ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఎంపీడీవో, ఎంపీవో, హౌసింగ్ ఏఈ, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. మండలంలోని గ్రామాల వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు వాటి పురోగతిని కార్యదర్శుల ద్వారా తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలలో వెనుకంజలో ఉన్న గ్రామ కార్యదర్శులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తూ, నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం స్పష్టమైన దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ, ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నిలదీశారు. ఈ తరహా వైఖరిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, ఇళ్ల నిర్మాణాల్లో స్పష్టమైన పురోగతి సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. మంజూరీ పొందిన వారందరూ తక్షణమే



ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉచిత ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆయా నిర్మాణ దశల ఆధారంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాల్లో బిల్లులు జమ చేస్తున్నామని గుర్తు చేశారు. బిల్లుల చెల్లింపుల్లో సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు లబ్ధిదారుల వివరాలు ఆధార్ కార్డు వివరాలతో సరిపోలి ఉన్నాయా అన్నది పరిశీలించుకోవాలని ఆయన పేర్కొన్నారు. సమీక్షలో జక్రాన్‌పల్లి ఎంపీడీవో సతీశ్, ఎంపీవో యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తోందని పాలిటెక్నిక్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సంగం అమృత్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రజా సాంస్కృతిక పండుగ బతుకమ్మ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ మన సంస్కృతిని తెలియజేస్తుందన్నారు. విద్యార్థినులు ఈ వేడుకను ఉత్సాహంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీవో పదాధికారులు దేవిసింగ్, పావని, నాగరాజు, చంద్ర, విఘ్నేష్, సరస్వతి, విజయ, సుజాత పాల్గొన్నారు.



## జాతీయస్థాయిలో వైద్యకళాశాల విద్యార్థుల ప్రతిభ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నిజామాబాద్ మెడికల్ కాలేజ్ విద్యార్థులు జాతీయస్థాయిలో తమ ప్రతిభ చాటారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థులు బోయిందల సూర్య, శశాంత్ కుమార్ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎంఐడీ-దర్మకాన్2025లో పాల్గొన్నారు. అక్కడ నిర్వహించిన డీవీఎల్-యూజీ డెర్మటాలజీ క్విజ్‌లో వీరు రెండోస్థానం సాధించారు. క్విజ్‌కి సంబంధించిన ప్రిలిమినరీ పరీక్షలు ఆగస్టులో నిర్వహించగా, దేశవ్యాప్తంగా 100కి పైగా బృందాలు పాల్గొన్నాయి. వాటిలో నుంచి ఐదు బృందాలు జాతీయ ఫైనల్స్‌కు ఎంపికయ్యాయి. అందులో నిజామాబాద్ మెడికల్ కాలేజ్ విద్యార్థులు మెరుగైన ప్రదర్శన కనబర్చి రెండో స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, వైద్యకళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డీఎంఈ ఎన్.కృష్ణ మోహన్, కళాశాల డెర్మటాలజీ హెచ్‌వోడీ రామ్మోహన్ విద్యార్థులను అభినందించారు.



## జాతీయస్థాయి ట్రెక్కింగ్‌కు నిజామాబాద్ ఎన్‌సీసీ కేడెట్లు

**అక్షరటుడే, ఇందూరు:** జాతీయస్థాయి ఎన్‌సీసీ ట్రెక్కింగ్ క్యాంప్‌నకు నిజామాబాద్ గ్రూప్ (నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్) నుంచి 51 మంది కేడెట్లు పాల్గొంటున్నారని కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ప్రియాజిత్ సూర్ తెలిపారు. క్యాంప్ ఈనెల 25 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు తిరుపతిలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రెక్కింగ్ అడ్వంచర్ వంటి జాతీయ క్యాంప్‌లు ఆయా ప్రాంతాల్లో చేయడం వల్ల జాతీయత భావం పెరుగుతుందన్నారు. ప్రకృతిని, పరిస్థితులను అర్థం చేసుకునే సామర్థ్యం వస్తుందన్నారు. ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి మాట్లాడుతూ క్యాంప్‌ల వల్ల ఎన్‌సీసీ విద్యార్థుల్లో శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుందన్నారు. నిజామాబాద్ నుంచి 14 మంది పాల్గొంటున్నారని తెలిపారు.

## జీఎస్టీ పేరుతో ప్రజలపై భారం మోపింది బీజేపీ కాదా..?



**అక్షరటుడే, ఇందూరు:** కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక జీఎస్టీ పేరుతో లేని భారాన్ని ప్రజలపై మోపింది నిజమా..? కాదా.. అని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. జీఎస్టీని తగ్గించామని చెబుతూ దేశవ్యాప్తంగా బీజేపీ డబ్బాలు కొట్టుకుంటోందని.. అసలు జీఎస్టీ పేరుతో ప్రజలపై భారం ఎవరు వేయమన్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది జీఎస్టీ పేరుతో దేశ ప్రజల నుంచి రూ. 22 లక్షల కోట్లను దోచుకున్నారని ప్రశాంత్ రెడ్డి అన్నారు. తాజాగా దాంట్లో నుంచి రూ. 2 లక్షల కోట్లు తగ్గించి ఏదో మెహర్బానీ చేసినట్లు చెప్పుకోవడం బీజేపీకే చెల్లిందన్నారు. తొమ్మిదేళ్లలో జీఎస్టీ పేరుతో ప్రజల నుంచి బలవంతంగా రూ.100 లక్షల కోట్లు దోచుకుని ఇప్పుడు కొంతమేర తగ్గించి దసరా కానుక అంటూ కేంద్రం ప్రజలను మభ్యపెడుతోందని మండిపడ్డారు. ఎంపీ అర్వింద్ మంగళవారం జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ.. తెలంగాణలోని ప్రతి వ్యక్తికి నెలకు రూ.5 వేలు మిగిల్చామని చెప్పారని.. అంటే గడిచిన తొమ్మిదేళ్లుగా జీఎస్టీ పేరుతో తెలంగాణలో ప్రతివ్యక్తి నుంచి రూ.5వేల చొప్పున మొత్తం రూ. 5,40,000 కోట్లు బీజేపీ దోచుకున్నట్టేనని ఆయన విమర్శించారు. దీనికి సమాధానం చెప్పాలని ఎంపీ అర్వింద్‌కు సవాల్ విసిరారు. ఇంకా ఎన్ని రోజులు ఇలా మాయమాటలతో ప్రజలను మోసం చేస్తారన్నారు. ఈ తతంగాన్ని పూర్తిగా గమనిస్తున్న ప్రజలు ఓట్ల సమయంలోనే బీజేపీకి బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు.



## ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి

**అక్షరటుడే, బాన్సువాడ:** కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పనిచేస్తుందని ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు తెలిపారు. చందూర్, మోస్రాలలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ సారథ్యంలో రాష్ట్రంలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని వివరించారు. వాటిని ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలంతా కలిసికట్టుగా ఉంటేనే ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ సురేష్ బాబా, మాజీ జెడ్పీటీసీ అంబర్ సింగ్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఖాలెక్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ లక్ష్మణ్, కాంగ్రెస్ చందూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుదిరి స్వామి బుధవారం పంపిణీ చేశారు. మొత్తం 9 మంది లబ్ధిదారులకు రూ.3.53 లక్షల చెక్కులు అందించినట్లు ఆయన వివరించారు. చెక్కుల మంజూరుకు కృషిచేసిన రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మాజీ ఎమ్మెల్యే అనిల్ ఈరవత్రి, కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్ కుమార్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జెజె నర్సయ్య, నాగేంద్ర, అనంతరావు, సురేష్, మహేష్ పాల్గొన్నారు.



## ఘనంగా కొండాలక్ష్మణ్ బాపూజీ వారోత్సవాలు

**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ కోసం పోరాటం చేసిన త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ అని శబ్ద తరంగిణి సంస్థ వ్యవస్థాపకుడు షేర్ల దయానంద్ అన్నారు. కొండాలక్ష్మణ్ బాపూజీ వారోత్సవాల సందర్భంగా సంస్థ కార్యాలయంలో బుధవారం బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం పాలనకు వ్యతిరేకంగా రజాకార్లతో పోరాడిన వీరుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ గౌడ్, కార్మిక నాయకుడు రాపెల్లి శ్రీనివాస్, కొండి రమేష్, ఆడెపు లింబాద్రి, ప్రకాష్ గౌడ్, గీత లక్ష్మీనారాయణ, బాబురావు, భాస్కర్, పెంటయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శ



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని ముస్తాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త సిద్ధు తండ్రి ఇటీవల మృతి చెందాడు. దీంతో బుధవారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ముదాం సాయిలు, దాసరి పర్వయ్య, వివేకానంద, బొల్లు శ్రీకాంత్ తదితరులున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



**అక్షరటుడే,బాల్కొండ:** ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన ధరావస్తు లక్ష్మి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. ఈ సాయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి మృతురాలి కుటుంబానికి అందజేశారు.

## అర్ధరాత్రి పోలీసుల తనిఖీలు..

### భారీగా బంగారం పట్టివేత

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఏసీపీ బృందం పోలీసులకు మంగళవారం అర్ధరాత్రి తర్వాత భారీగా బంగారం తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో కంఠేశ్వర్ ప్రాంతంలో సోదాలు నిర్వహించగా.. ఓ కారులో అక్రమంగా తరలిస్తున్న కిలో బంగారం దొరికింది. ఈ బంగారాన్ని మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి నిజామాబాద్ మీదుగా ఆర్మూర్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. కారులోని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని మూడో టౌన్ పోలీసులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు ఆర్మూర్‌కు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. పోలీసులు పట్టుకున్న బంగారం విలువ రూ.కోటికి పైగా ఉంటుంది.

పోతంగల్ మండలకేంద్రంలోని విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోంది. కొందరు బడాబాబులు ప్రభుత్వ భూమిలో వెంచర్లు వేసి ఆక్రమించుకుంటున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

– అక్షరటుడే, కోటగిరి



# ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం..

▸ పట్టించుకోని అధికారులు ▸ హద్దులు గుర్తించాలని ప్రజల డిమాండ్

పోతంగల్ మండల కేంద్రంలోని 171 సర్వే నంబర్‌లో 69 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించింది. ఇందులో కొందరు రైతులు పంట పండించుకోగా, మరికొందరు ఇటుకబట్టీలు పెట్టుకుని ఉపాధి పొందారు. కాగా.. గ్రామంలో కొందరు బడాబాబులు 1.30 ఎకరాల భూమిని కొనుగోలు చేసి.. అదే అదునుగా మరింత భూమిని కబ్జా చేస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కొనుగోలు చేసిన భూమికి ఆధారాలుంటే చూపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం సదరు సర్వే నంబరునే మార్చేసి 172, 173గా సృష్టించారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై అధికారుల చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులు గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతున్నారు. గతంలో కూడా పోతంగల్ మండల కేంద్రానికి చెందిన యువకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు తూతూమంత్రంగా సర్వే చేసి చేతులు దులుపుకున్నారని చెబుతున్నారు.

### కబ్జాదారులు బెదిరిస్తున్నారు



15 ఏళ్ల కిందట మా నాన్నతో పాటు మరో నలుగురికి ప్రభుత్వం ఇంటి కోసం స్థలం కేటాయించింది. దీంతో సదరు స్థలంలో రేకుల షెడ్లు వేసుకున్నాం. అయితే, కొందరు కబ్జాదారులు మమ్మల్ని బెదిరించి తొలగిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గౌస్, పట్టాదారు

### చర్యలు తీసుకోవాలి



కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని, పేదలకు న్యాయం చేయాలి. ఇళ్ల స్థలాలు లేనివారికి కేటాయించాలి. ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– పెద్దొళ్ల శంకర్, పోతంగల్

### సర్వే చేసి చర్యలు తీసుకుంటాం




ప్రభుత్వ స్థలాల కబ్జా విషయమై ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేపడతాం. ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులు గుర్తిస్తాం. కబ్జాకు గురైనట్లు తేలితే చర్యలు తీసుకుంటాం.

– గంగాధర్, తహశీల్దార్



ఫ్రెండ్స్ యూత్ దుర్గామాత మండలి కుమార్‌గల్లీలో..



కోటగల్లీలోని బాల త్రిపుర సుందరి మండలిలో..




గాజుల్‌పేట్‌లోని కాత్యాయణి దేవి మండపంలో ..



నగరంలోని కోట మైసమ్మ ఆలయంలో..

## అమ్మకు భక్తితో పూజలు..

ఉమ్మడిజిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. దుర్గామాత మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రుల్లో మూడోరోజు అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రూపంలో అమ్మవారు సకల జీవరాశికి ఆహారాన్ని ప్రసాదించే తల్లిగా పూజించబడుతోంది. మండపాల వద్ద భక్తులు కోలాటాలు ఆడుతూ సందడి చేస్తున్నారు. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



గోనెరెడ్డి భక్త ఆంజనేయ ఆలయంలో..



బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో..



జెండాగల్లీలో శ్రీ వరదాయిని దుర్గాదేవి..



వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో..



ఇంద్రపూర్‌లోని రేపల్లె దేవి మండలంలో..

# ఫిక్స్‌డ్ డిపాజిట్ల పేరుతో భారీ మోసం.. నిందితుల అరెస్ట్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** అనుమతులు లేని కంపెనీల పేరుతో అమాయక ప్రజల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్ల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు క్రైం బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర చారి పేర్కొన్నారు. సీసీఎస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. 2022లో శ్రేమ్ ఎవర్ గ్రీన్ కంపెనీ పేరుతో నగరంలోని హస్మీ కాలనీకి చెందిన మొయిజ్ ఖాన్, కొంతమంది మిత్రులు కలిసి అనుమతులు లేకుండా సంస్థను ఏర్పాటు చేశారు. అత్యధికంగా వడ్డీని ఇప్పిస్తామంటూ డిపాజిట్లను భారీమొత్తంలో స్వీకరించారు. వీరిచేతిలో మోసపోయిన ఇందల్వాయికి చెందిన ఉపాధ్యాయుడు హకీం ఇందల్వాయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు 2022 నుంచి ఇప్పటివరకు సుమారు 125 మందిని చీట్ చేసి వారి వద్ద నుంచి డిపాజిట్లు స్వీకరించినట్లు గుర్తించారు. నిందితులు దేశవ్యాప్తంగా రూ. 8.50 కోట్ల వసూలు చేశారు. దేశంలోని ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ప్రాంతాల్లో మీటింగ్‌లను ఏర్పాటు చేసి ప్రజలను మోసగించారు. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో బ్రాంచ్‌లను కూడా నెలకొల్పారు. అమాయక ప్రజలను డిపాజిట్ పేరుతో చీటింగ్ చేసిన నగరానికి చెందిన మోయిజ్ ఖాన్, వాజిద్ హుస్సేన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీసీఎస్ ఏసీపీ పేర్కొన్నారు. ఇంకెవరైనా బాధితులుంటే సీపీకి ఫిర్యాదు చేయాలని కోరారు.






## ప్రభుత్వ ఆస్పత్రిలో మెగా హెల్త్ క్యాంప్

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** స్వస్తినారి సశక్తి పరివార్ అభియాన్ భాగంగా బుధవారం కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. వైద్యుడు నరసింహస్వామి ఆధ్వర్యంలో శిబిరం జరిగింది. హెల్త్‌క్యాంప్‌లో లో గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్, చిల్డ్రన్ స్పెషలిస్ట్, జనరల్ సర్జరీ, డెంటల్, నేత్ర వైద్య నిపుణులు, చర్మ, చెవి, ముక్కు, సైకాలజిస్ట్ సంబంధించిన డాక్టర్లు రోగులకు చికిత్స అందించారు. శిబిరానికి కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాలకు సంబంధించిన వివిధ గ్రామాల ప్రజలు వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యులు నాగరాజ్, కమ్మర్‌పల్లి హెల్త్ సెంటర్ డాక్టర్ హసీనా, జీవి రమణ, గోవ మహేందర్, పద్మలత, శరత్, పాపయ్య, దేవేందర్, అనిత, ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. హెల్త్ క్యాంప్‌లో సుమారు 500మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు పీహెచ్‌సీ సిబ్బంది పేర్కొన్నారు.




## ఘనంగా కోటపాటి జన్మదిన వేడుకలు

**అక్షరటుడే, ఆర్మూర్:** రైతు నాయకుడు, గల్ఫ్ కార్మిక నేత కోటపాటి నరసింహ నాయుడు జన్మదిన వేడుకలను బుధవారం ఆర్మూర్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి హాజరై మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ.. కోటపాటి నరసింహ నాయుడు సామాజిక సేవలో భాగంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రైతులు గల్ఫ్ కార్మికులు కోసం పాటుపడుతూ మాలాంటి వారు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు అనిల్ కుమార్, పోల్కం వేణు, మందుల బాలు, ఊరే బాలయ్య, రమేష్, సునీల్ పిప్పిరి, కొక్కుల విద్యాసాగర్, చేపూర్ రుక్మాజి, నరేష్ వర్మ పాల్గొన్నారు.



## నాగంపేటలో జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ

**అక్షరటుడే, బాల్కొండ:** ముప్కాల్ మండలం నాగంపేట్‌లో జీపీ భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా రూ. 20 లక్షలు మంజూరైనట్లు పంచాయతీ కార్యదర్శి గౌతమి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మెండోరా తహశీల్దార్‌గా శ్రీనివాస్ రెడ్డి



**అక్షరటుడే, మెండోరా:** మెండోరా తహశీల్దార్‌గా శ్రీనివాస్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాస్ రెడ్డి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన సంతోష్ రెడ్డి నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.